రేపు 'యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్'

రాంగోపాల్‌పేట్: యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న సికింద్రాబాద్ ఎస్పీరోడ్‌లోని వెస్లీ డిగ్రీ కళాశాలలో క్రిస్మస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. శనివారం సికింద్రాబాద్‌లోని కమిటీ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి జేమ్స్ సిల్వెస్టర్, కోశాధికారి థామస్ జాన్, స్టీవా గెలీలియోలు విలేకరులతో మాట్లాడుతూ, గత 44 ఏళ్ల నుంచి క్రిస్మస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అలాగే ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా క్రైస్తవుల్లోని అన్ని సంఘాల ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామని, పెద్ద ఎత్తున క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనితో పాటు మాజీ ఐఏఎస్ అధికారులు జీడీ అరుణ, యేసుదాస్, మాజీ కో ఆప్షన్ మెంబర్ విద్యా శ్రవంతి, ప్రముఖులు ప్రభుదాస్, రెవరెండ్ పద్మారావు, బిషప్ డాక్టర్ ఎంఏ డేనియల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. అలాగే దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా 250 మందితో అద్భుతమైన క్యారల్స్ కార్యక్రమంతో పాటు వివిధ సంఘాల నుంచి వచ్చిన క్యారల్స్ బృందగానం అలరిస్తుందన్నారు. బైబిల్ క్విజ్, క్యారల్స్ క్విజ్ నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

నేడు గోవు సంస్మరణార్థం మహాన్నదానం


హనుమాన్ దేవస్థానం గోశాలలో కుబేరుడు (ఫైల్)

సనత్‌నగర్: గోవు సంస్మరణార్థం కామధేనువు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని గోశాలలో కుబేరుడిగా పిలుచుకునే ఎద్దు (ఒంగోలు ఎద్దు) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శివైక్యం చెందింది. ఎద్దు చిన్నతనం నుంచే ఇక్కడి గోశాలలో నందీశ్వరుడిగా భావిస్తూ సేవకులు, భక్తులు సేవలందించారు. కుబేరుడితో ఉన్న ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ శాస్త్రోక్తంగా కర్మకాండలు కూడా జరిపారు. కుబేరుడి పేరిట ఆదివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కామధేనువు సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజోత్సవం



కంటోన్మెంట్ : అయ్యప్ప పూజలతో కంటోన్మెంట్‌లోని వివిధ కాలనీలు, బస్తీల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పలుచోట్ల సామూహిక పడి పూజ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బోయిన్‌పల్లి మర్రి రామ్‌రెడ్డి కాలనీలో శీలం కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పపడిపూజ కార్యక్రమం జరిగింది. గంగపుత్ర నర్సింగ్ భజన బృందం ఆధ్వర్యంలో భజనలు నిర్వహించిన అనంతరం స్వామివారిని ఊరేగించారు. వందలాది మంది అయ్యప్ప స్వాములతో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రోమా స్కేప్స్ చిత్రాలు


చిత్రాలను పరిశీలిస్తున్న మెఘా ఇంజినీరింగ్ డైరెక్టర్ సుధారెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 14లోని కదరి ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ చిత్రకారిణి సంగీతారెడ్డి తీర్చిదిద్దిన పెయింటింగ్స్ కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. క్రోమా స్కేప్స్ థీమ్‌తో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను శనివారం మెఘా ఇంజినీరింగ్స్ డైరెక్టర్ సుధారెడ్డి, ప్రముఖ చిత్రకారుడు ఏలె లక్ష్మణ్ ప్రారంభించారు. ఆలోచనాత్మక పెయింటింగ్స్‌తో సంగీతారెడ్డి వీటిని కనువిందుగా తీర్చిదిద్దారని ఆమె కొనియాడారు.

'బచపన్'లో ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్





బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని సాగర్ సొసైటీలో ఉన్న బచ్‌పన్ ప్లే స్కూల్ అండ్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఏటా విద్యార్థులను ప్రోత్సహించడం, వారిలో నైపుణ్యాలను వెలికితీయడం లక్ష్యంగా ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సమీర్ జైన్, ప్రిన్సిపాల్ రహెతున్నీసా తెలిపారు. ఆలోచనాత్మక ప్రాజెక్టులతో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. 120 నమూనాలను ఇందులో భాగంగా ప్రదర్శించారు. తరగతి గదుల్లో తాము నేర్చుకున్న పాఠాలకు విద్యార్థులు ఆకట్టుకునే నమూనాలను ఇక్కడ ప్రదర్శించారు. బుడిబుడి నడకలతో చిన్నారుల కార్యక్రమాలు తల్లిదండ్రులను కట్టిపడేశాయి.

విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి


బాలాపూర దారిపై నిర్మించిన గేటును పరిశీలిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగించకుండా నిమ్స్ అభివృద్ధి పేరుతో అన్ని మార్గాలు మూసి వేసి విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే అన్ని మార్గాలు మూసివేసి కేవలం నిమ్స్ ఆస్పత్రి లోపలినుంచి బాలాపూర బస్తీ మీదుగా పాఠశాలకు చేరుకునేలా ఒక గేటు ఏర్పాటు చేయడంతో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు విజయారెడ్డిని సంప్రదించారు. దీంతో ఆమె డిప్యూటీ డీఈఓ శామ్యూల్‌రాజ్‌తో కలిసి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఈఈని సంప్రదించగా ఆయన పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కలవగా తాను దారులు మూసివేయాలని ఎప్పుడూ చెప్పలేదని, వెంటనే ఈఈని సంప్రదించి దారులు ఎందుకు మూసివేశారని ప్రశ్నించి నూతన పాఠశాల నిర్మించి పిల్లల్ని తరలించే వరకు అన్ని దారులు తెరవాలని ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో వేగం కొనసాగేనా?

సికింద్రాబాద్ నియోజకవర్గానికి గతంలో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తూ.. ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసిందని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది మంజూరైన నిధులతో కొన్ని భారీ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మరిన్ని పనుల విషయంలో సాంకేతిక సమస్యలు తొలగించే ప్రయత్నాలు ప్రారంభించిన సమయంలోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ ప్రక్రియ పూర్తై సిట్టింగ్ ఎమ్మెల్యే ఘన విజయం సాధించినా.. ప్రభుత్వం మారింది. మంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా కేబినెట్ హోదాలో 9 ఏళ్లపాటు కొనసాగిన ఆయన సాధారణ ఎమ్మెల్యేగా మారిపోయారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో జీఓలకు అనుగుణంగా ప్రత్యేక నిధుల విడుదల జరుగుతుందా.. లేదా అనే సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతోంది. – సికింద్రాబాద్


సీతాఫల్‌మండిలో నిర్మాణదశలో ఉన్న విద్యాసంస్థల భవనం

- ప్రభుత్వం మారడంతో అనుమానాలు
- లష్కర్‌లో ప్రారంభంకాని అభివృద్ధి పనులు

సికింద్రాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత భారీ అభివృద్ధి పనులకు బీజం పడింది. కేబినెట్ హోదాలో ఉన్న ఇక్కడి ఎమ్మెల్యే అభివృద్ధి పనుల నిమిత్తం పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయించగలిగారు. విద్యాశాఖ, వైద్యశాఖ, పురపాలకశాఖల మంత్రులకు ఇక్కడి సమస్యలు వివరించి రూ.కోట్ల నిధులు మంజూరు చేయించారు. సీతాఫల్‌మండిలోని కుట్టివెల్లోడి ఆసుపత్రి స్థలంలో అధునాతన ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.11.30 కోట్లు, సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ డిగ్రీ కళాశాలల భవన సముదాయం నిర్మాణం కోసం రూ.30 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రెండు భవనాల నిర్మాణ పనులను ఎన్నికల కోడ్ సమీపిస్తున్న తరుణంలోనే ప్రారంభించారు. నిర్మాణ పనులు పిల్లర్ల దశకు చేరుకున్నాయి.

మరో నాలుగు ప్రతిపాదనలు..

సికింద్రాబాద్‌లో రైల్వే ట్రాక్‌ల వద్ద మరో రెండు వంతెనల నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసింది. రూ.30 కోట్లు మెట్టుగూడ–చిలకలగూడ చౌరస్తా, రూ.20 కోట్లు, మాణికేశ్వరీనగర్–సీతాఫల్‌మండి మార్గాల్లో రోడ్డు అండర్ బ్రిడ్జి వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా అడ్డగుట్ట, లాలాపేటల్లో అక్కడి ప్రభుత్వ ఆసుపత్రుల ప్రాంగణాల్లోనే అధునాతన ఆసుపత్రి భవనాలను నిర్మించేందుకు రూ.27 కోట్లు గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. ఈ అభివృద్ధి పనులు ఎన్నికలకోడ్ నేపథ్యంలో ప్రారంభం కాలేదు.

ప్రత్యేక నిధులు కావడంతో..

ఎమ్మెల్యే నిధులతో ప్రతిపాదించిన పనులకు ఆటంకాలు ఉండకపోయినా ప్రత్యేక నిధుల విషయంలో మాత్రమే స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తనకున్న పలుకుబడితో పెద్దమొత్తంలో ప్రత్యేక నిధులు మంజూరు చేయించుకోగలిగారు. నాలుగు భారీ అభివృద్ధి పనులు ప్రారంభించక ముందే ప్రభుత్వం మారింది. ఆయా శాఖలకు మంత్రులు మారారు. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల విడుదల సజావుగా జరిగి అవాంతరాలు లేకుండా అభివృద్ధి పనులు జరుగుతాయా లేదా అన్న సందేహాలు స్థానికులను వెంటాడుతున్నాయి.

- గడిచిన మూడేళ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. ప్రభుత్వం మారిన క్రమంలో అభివృద్ధి పనుల వేగం యథాతథంగా ఉంటుందా.. లేదా అన్నది వేచిచూడాల్సిందే.

అభివృద్ధి పనులు ఆగవు..



ప్రభుత్వం మారినా అభివృద్ధి పనులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రతిపాదిత పనులకు గత ప్రభుత్వమే ఆమోదం తెలిపింది. నిధుల విడుదల విషయంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటాం. ఇక్కడి పరిస్థితులకు ప్రభుత్వ ప్రతినిధులకు వివరించి ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూనే మరిన్ని అభివృద్ధి పనులకోసం నిధులు రాబడతాం.
– పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే సికింద్రాబాద్

ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి నాయకుల సమావేశం


మాట్లాడుతున్న ఎంఎస్పీ జాతీయ నాయకులు

బౌద్ధనగర్: ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలో నిర్మాణం చేసేందుకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో బస్తీ నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల నిర్మాణానికి నాయకులు సిద్ధం కావాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు నరేంద్ర మాదిగ పిలుపునిచ్చారు. శనివారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల జిల్లా స్థాయి కమిటీల ఎన్నిక సమావేశం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నరసయ్య మాట్లాడుతూ.. నేటి నుంచి నెలరోజుల పాటు కమిటీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అతి త్వరలోనే సాకారం కాబోతుందని, ప్రధానిపై నమ్మకం ఉందని, ఎస్సీ వర్గీకరణతో పాటు భవిష్యత్ రాజకీయ పోరాటానికి మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సత్యనారాయణ, వాసుదేవ్, రామారపు శ్రీనివాస్, అజిత్ కళ్యాణ్, వీఎస్.రాజు, ప్రకాష్, అరుణ్‌కుమార్, టీవీ నరసింహ, డప్పు మల్లికార్జున్, కిషన్, రవి, రాజశేఖర్, రామకృష్ణ, రేణుకాదేవి, మహేష్, సునీల్, దాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను అందించాలి


సమావేశంలో తల్లుల సంఘం, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: విద్యార్థులకు తరగతికి తగిన విద్యా సామర్థ్యాలను అందించాలని తల్లుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు తీసుకొచ్చిందని, అన్నింటికన్నా విద్యాపాలసీకి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, మౌలిక వసతులు కూడా కల్పించాలన్నారు. విద్యార్థుల హక్కులు కాపాడేందుకు తరగతికి తగిన విద్యా సామర్థ్యాలు అందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు తల్లుల సంఘం ద్వారా వినతిపత్రాలు సమర్పించి విద్యార్థుల హక్కులను కాపాడాలని సంఘం సభ్యులకు సూచించారు. రామలీల, శోభ, బాలమణి, సీఆర్పీఎఫ్ కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, మహేశ్వరి, పుష్ప, రమ, మమత, రాణి, గౌతమి, క్రాంతిరేఖ, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఏ. సువర్ణ, భాగ్య, లావణ్య, సౌజన్య తదితరులున్నారు.

స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన


మాట్లాడుతున్న అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ రాజీవ్‌కుమార్

అడ్డగుట్ట: ఆర్పీఎఫ్ సిబ్బంది రైళ్లు, రైల్వేస్టేషన్లలో ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని వారి శ్రేయస్సును పెంపొందించే దిశగా ఆర్పీఎఫ్ సికింద్రాబాద్ డివిజన్ చురుకుగా అడుగులు వేస్తుందని ఆదనపు డీఆర్‌ఎం రాజీవ్‌కుమార్ అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని సంచాలన్‌భవన్‌లో మైండ్‌ఫుల్‌నెస్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, లైఫ్ రీ–ఇంజినీరింగ్‌లపై ఆర్పీఎఫ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు డీఆర్‌ఎం రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్పీఎఫ్ సిబ్బందికి ఉపశమనాన్ని అందించేందుకు వ్యూహాత్మకంగా ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

- ఆర్పీఎఫ్ సిబ్బంది విధులకు సంబంధించిన డిమాండ్ అంశాలను నావిగేట్ చేయడానికి, విలువైన సాధనాలతో వారిని సన్నద్ధం చేయడమే లక్ష్యమన్నారు. రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎదురౌతున్న ప్రత్యేక సవాళ్లను అర్థం చేసుకుంటూ.. అధికారులకు సహాయక వాతావరణాన్ని పెంపొందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

ఒత్తిడి నివారించే దిశగా..

ఆర్పీఎఫ్ సిబ్బంది ఒత్తిడిని నివారించి వారి జీవిత విధానాన్ని తిరిగి రూపొందించడమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ డెబస్మిత బెనర్జీ మాట్లాడారు. ఆర్పీఎఫ్ సిబ్బంది రైళ్లు, రైల్వేస్టేషన్లలో కీలకపాత్ర నిర్వహిస్తారన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ మెరుగైన సేవలను అందిస్తుంటారని, అలాంటి సమయాల్లో మానసిక, భావోద్వేగానికి గురవుతుంటారన్నారు.

- శారీరక, మానసిక భావోద్వేగాలను అధిగమించేందుకు మైండ్‌ఫుల్‌నెస్ టెక్నిక్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీలను ఆచరించాలని సూచించారు.

స్వీయ సంరక్షణ..

స్వీయ సంరక్షణతో పాటు స్థితి స్థాపకత కోసం వనరులతో ఆర్పీఎఫ్ సిబ్బందిని శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవగాహన సదస్సు ద్వారా రైల్వేస్టేషన్లు, రైల్లో విధుల్లో సవాళ్లను ఎదుర్కొంటున్న ఆర్పీఎఫ్ సిబ్బందికి ఉపశమనం లభిస్తుందన్నారు. అధికారులు ఈవీ. గిరీష్, బీకే. రంజన్, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబాజర్‌లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో).. టమాటా 21, నల్ల వంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 55, పందిరి బీర 60, క్యాబేజీ 13, క్యారెట్ 27, దొండ 65, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 70, గోకరకాయ 53, కీర 25, దోసకాయ 25, బీట్‌రూట్ 27, ఉల్లి 25, ఆలు 23, చామ 45 కంద 50, సొరకాయ 15, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



అడ్డగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిలోని ఇస్సాపూర్‌కు చెందిన జగన్‌రెడ్డి (34) వృత్తిరీత్యా కూలీ. గత కొంత కాలం క్రితం నగరానికి వచ్చి మల్కాజ్‌గిరి ప్రాంత పరిధిలో పనిచేసుకుంటూ.. జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై శనివారం ఉదయం 10 గంటల సమయంలో మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబర్ 3 లో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన రైల్వే పోలీసులు అతడి వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అప్పారావు



ఉస్మానియా యూనివర్సిటీ: ఆలిండియా అకౌంటింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఓయూ కామర్స్ విభాగం సీనియర్ అధ్యాపకులు ప్రొ.అప్పారావు ఎన్నికయ్యారు. ఈనెల 9, 10 తేదీల్లో తిరువనంతపురంలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో వేయిమంది ప్రతినిధులతో జరిగిన 45వ ఆల్ ఇండియా అకౌంటింగ్ కాన్ఫరెన్స్‌లో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపా రు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో 46వ కాన్ఫరెన్స్‌ను కోల్‌కతాలో నిర్వహించనున్నట్లు వివరించారు.

17 నుంచి ధనుర్మాసోత్సవాలు

బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇందులో భాగంగా ప్రతిరోజూ పెద్ద ఎత్తున ఆరాధన, అలంకారాలు ధనుర్మాస అర్చనలు తిరుప్పావై ప్రవచనాలు, ప్రబంధ సేవాకాలం, పాశురవిన్నపం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ నెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారుజామున 2.30 గంటలకు సుప్రభాత సేవ, తదుపరి శ్రీస్వామివారి గరుడసేవ, వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తామన్నారు. నివేదన, తిరుప్పావై, అర్చనాది కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహిస్తారని ఆలయ చైర్మన్ చుండూరి రామయ్య, ఈవో ఎస్. లావణ్య తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఆఫర్ లెటర్లు అందుకున్న వారితో వివిధ కంపెనీల ప్రతినిధులు, జాబ్‌మేళా నిర్వాహకులు

సనత్‌నగర్: దిశ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ కార్యాలయ ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) సంయుక్తంగా శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఎర్రగడ్డలోని సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో నిర్వహించిన జాబ్‌మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 98 పర్సంటైల్, వీఎల్ఆర్ ఫెసిలిటేటర్స్, యాక్ట్ ఫైబర్‌నెట్, వెర్కో డ్రగ్స్, డాన్ బాస్కో లైట్, స్పైడర్ ఎలక్ట్రికల్స్ వంటి దాదాపు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగార్థులను ఎంపిక చేసుకున్నారు. నగరం నలుమూలల నుంచి 150 మంది హాజరుకాగా.. ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి విజయ్, బీఎస్‌కే డైరెక్టర్ శరత్‌బాబు, దిశ కో–ఆర్డినేటర్లు ఐవాన్‌వాజ్, స్టీవన్ తదితరులు పాల్గొన్నారు.

జెక్ కాలనీ అధ్యక్షుడిగా డాక్టర్ మల్లు ప్రసాద్



సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ మల్లు ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత కార్యవర్గంలో ఆయన ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. రెండేళ్ల పాటు కొనసాగే ఫెడరేషన్ కొత్త కమిటీని ఎన్నుకునేందుకు ఆదివారం (నేడు) ఎన్నికలు జరగాల్సి ఉంది. నామినేషన్ దాఖలుతో పాటు పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ శనివారం ముగిసింది. అయితే అధ్యక్ష పదవికి మల్లు ప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. పోటీలో ఇంకెవ్వరూ లేకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారి పదవికి కూడా టి.శివారెడ్డి నామినేషన్ ఒక్కటే రావడంతో ఆయన కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి హరిప్రసాదరావు తెలిపారు. ఇక మిగిలిన ముఖ్య పదవులు ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహకార్యదర్శి పదవులకు పోటీ ఉండటంతో ఎన్నిక ప్రక్రియ అనివార్యమైంది. ఉపాధ్యక్ష పదవికి ఐదుగురు, ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు, సహకార్యదర్శి పదవికి ఐదుగురు పోటీలో ఉన్నారు. సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించి ఆయా సభ్యులను ఎన్నుకోనున్నారు. ఒక్కో అపార్ట్‌మెంట్ నుంచి ఒకరు చొప్పున ఉన్న ఈసీ మెంబర్లతో పాటు వ్యక్తిగత గృహాలతో పాటు మొత్తం 90 మంది సభ్యులు ఓటింగ్ ద్వారా వారిని ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి చెప్పారు. కాగా, అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లు ప్రసాద్.. రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సోదరుడు కావడం గమనార్హం.

పాత పెన్షన్ విధానం అమలు ప్రకటన హర్షణీయం

పంజగుట్ట: అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్ తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చి అధికారంలోకి రాగానే పాత పెన్షన్ విధానం తీసుకొస్తామని చేర్చడంతో సుమారుగా లక్ష 70 వేల మంది సీపీఎస్ ఉద్యోగులు ఎంతో హర్షం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. 2004 తరువాత నియామకం అయిన వారికి పాత పెన్షన్ విధానం తొలగించి సీపీఎస్ విధానం అమలు చేశారని, అప్పటి నుంచి ఉద్యోగులు ఎంతో మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానంలో పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని కోరారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



లాలాపేట : తార్నాకలోని అరుణోదయ వృద్ధాశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం చైర్మన్ తాళ్ల లావణ్య హోమ్‌లో కేక్‌కట్ చేసి వృద్ధులతో కలిసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ వేడుకలకు ఎన్‌ఆర్‌ఐ తరుణ్‌కుమార్ హాజరై వృద్ధులకు దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. క్రిస్మస్ పండగ వరకు హోమ్‌లోని వృద్ధులకు కావాల్సిన సామగ్రిని అందజేశారు. ఫాదర్ సువర్న్ రాజ్, పందిళ్ల రవికుమార్, హోం సెక్రటరీ చిన్నాయాదవ్, సుబ్బు, కవిత తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడండి !


మాట్లాడుతున్న అయ్యప్ప సేవాసమితి సభ్యులు

లాలాపేట: పార్కుస్థలం పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లాలాపేట శ్రీ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బాలరాజు గుప్తా కోరారు. శనివారం లాలాపేటలో సమితి సభ్యులు మాట్లాడుతూ.. లాలాపేటలోని హౌసింగ్‌బోర్డు కాలనీ లేఅవుట్ చేశారని, సాయిబాబా దేవాలయం ఆవరణలో 783 గజాల స్థలాన్ని పార్కుకోసం కేటాయించి హౌసింగ్‌బోర్డు అధికారులు జీహెచ్‌ఎంసీ ద్వారా సాయిబాబా దేవాలయానికి ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు తాము హౌసింగ్ బోర్డు నుంచి కొనుగోలు చేశామని తప్పుడు ప్రచారం చేస్తూ.. సదరు స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సదరు స్థలం సాయిబాబా దేవాలయానికి చెందిందని ఇందులో నిర్మాణ పనులు చేయకూడదని వారికి సూచించామన్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి పార్కు స్థలాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు పేపర్ శ్రీను, శ్రీనివాసులుగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

శివాష్టపది గీతమాలిక ఆవిష్కరణ


ఆవిష్కరించిన సినీ గాయకుడు ఎస్పీ చరణ్

రసూల్‌పురా: శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆరాధ్య జన సేవా వాహిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో బొంతపల్లి దేవస్థానం సహకారంతో వీరభద్ర స్వామి కల్యాణం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకులు నేమాని పార్థసారధి సారథ్యంలో ప్రఖ్యాత సినీ గాయకుడు ఎస్పీ. చరణ్ మల్లికార్జున్ బృందం యువగాయనీగాయకులు ఆలపించిన భక్తిగీతాల విభావరి ఆహుతులను విశేషంగా అలరించింది. అనంతరం కళాతపస్వి విశ్వానాథ్ ఆధ్వర్యంలో వేటూరి రచన శివాష్టపది గీతమాలికను ఎస్పీ. చరణ్ ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక ప్రవక్తలు అనంత లక్ష్మి, బ్రహ్మశ్రీ శ్రీనివాస బంగారయ్యశర్మ, ట్రస్ట్ చైర్మన్ తాడికొండ విజయ్‌కుమార్, కార్యదర్శి ఇవటూరి కైలాష్, సుధాకర్ గుప్తా, శివకుమార్, యమునా పాఠక్ దుర్గప్రసాద్ మడిపల్లి దక్షిణామూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.